సంచలన సాయంకాల పత్రిక

# సత్యం

https://www.satyamdaily.net/

సోమవారం 23-12-2024

సంపుటి: 20 సంచిక: 229

పేజీలు: 4 వెల: రూ.1

## బ్యాటరీ ట్రైసైకిల్‌కు కనకరాజు విరాళం



(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

స్థానికంగా కిల్లీకొట్టు పెట్టుకొని కుటుంబాన్ని నెట్టుకొస్తున్న వాడాడ వైకుంఠరావుకు రోడ్డు ప్రమాదంలో కాళ్లు విరిగిపోవడంతో జీవనాధారం కష్టమైపోతుందని తెలుసుకున్న నగరానికి చెందిన డాక్టర్ ఆరికతోట కనకరాజు సోమవారం రూ.5వేలు ఆర్థికసాయం అందించారు. ఇంటి నుంచి దుకాణానికి వెళ్లడానికి కాళ్లు సహకరించకపోవడంతో బ్యాటరీ ట్రైసైకిల్ మీద వెళ్లేందుకు దాతల నుంచి వైకుంఠరావు సహాయాన్ని కోరుతున్నారని తెలుసుకొని, సోమవారం ఆయనకు రూ.5వేలు అందించారు. నగరంలో వన్‌వే ట్రాఫిక్ రోడ్డుకు దగ్గరలో ఉన్నవారు ఆయన షాపులో తినుబండారాలు, కూల్ డ్రింక్‌లు లాంటివి కొనుగోలు చేస్తే ఆయనకు మరింత ఉపయోగకరంగా ఉంటుందని, బ్యాటరీ ట్రైసైకిల్ కోసం సహాయం అందించదలచినవారు కొత్త టీవీఎస్ షోరూమ్ ఎదురుగా పాన్‌షాపులో వైకుంఠరావు అందుబాటులో ఉంటారని, దాతలు పెద్దమనసుతో ముందుకొస్తే గానీ ఆ కుటుంబం కష్టాలు తీరవని కనకరాజు అన్నారు.

## నౌపడకు సేవా అవార్డు



(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

తెలుగుదేశం పార్లమెంటరీ పార్టీ కార్యదర్శి నౌపడ సత్యనారాయణకు సమైక్య తెలుగు ఎంప్లాయిస్ అసోసియేషన్ ఆదివారం ఢిల్లీలో ఉన్న ఏపీ భవన్ అంబేద్కర్ ఆడిటోరియంలో సేవా అవార్డును ప్రదానం చేసింది. జిల్లాలో సంతబొమ్మాళి మండలం మేఘవరానికి చెందిన డాక్టర్ నౌపడ సత్యనారాయణ 1985 నుంచి 1992 వరకు మేఘవరం యూత్‌క్లబ్ అధ్యక్షుడిగా పని చేశారు. 1985లో తెలుగు విద్యార్థి సంఘానికి జిల్లా కార్యదర్శిగా పని చేశారు. 1989 నుంచి 1991 వరకు గ్రామ కమిటీలకు అధ్యక్షుడిగాను, ఆ తర్వాత ఈనాడులో జర్నలిస్టుగాను, 1991 నుంచి ఆంధ్రా కోస్తా పత్రికకు ఎడిటర్‌గాను, తెలుగు యువత జిల్లా సెక్రటరీగా నౌపడ సత్యనారాయణ పని చేశారు. 1989 నుంచి 2009 వరకు అప్పటి ఎంపీ, కేంద్రమంత్రిగా పనిచేసిన కింజరాపు ఎర్రన్నాయుడుకు పొలిటికల్ కార్యదర్శిగా, ఆ తర్వాత నుంచి నేటివరకు టీడీపీ పార్లమెంటరీ కార్యాలయ కార్యదర్శిగా పని చేస్తున్నారు. 1991 నుంచి ఇప్పటి వరకు ఆయన సేవలకు గుర్తింపుగా అనేక అవార్డులు, బిరుదులు వరించాయి. రైల్వేబోర్డు మెంబరుగాను, టెలికం అడ్వయిజరీ బోర్డు మెంబరుగాను పని చేసిన నౌపడ సత్యనారాయణ పొలిటికల్ సైన్స్‌లో ఎంఏ, పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్‌లో మరో ఎంఏ, హెచ్‌ఆర్‌లో ఎంబీఏ పూర్తిచేసిన విద్యాధికుడు. మోడీస్ ఫెయిల్యూర్ లాంచ్ బై నారా చంద్రబాబునాయుడు అనే పుస్తకాన్ని కూడా నౌపడ సత్యనారాయణ రాశారు. శ్రీకాకుళం జిల్లా యూత్ అడ్వయిజరీ బోర్డుకు నెహ్రూ యువకేంద్రం తరఫున వైస్‌చైర్మన్‌గా సత్యనారాయణ గతంలో వ్యవహరించారు.

# దోపిడీ కుట్ర మూలాలు గూనపాలెంలో..

(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

- తెలంగాణ నుంచి వచ్చిన కిరాయి మూకలు
- పెద్దిన లక్ష్మణరావు పథకంలో భాగమే గోవింద్ ఇంట్లో చొరబాటు
- స్థానికంగా ఉంటూ రెక్కీ
- పోలీసుల అదుపులో సూత్రధారీ, పాత్రధారులు

ఈమధ్య శ్రీకాకుళం బాగా డెవలపయింది. పలాసలో టౌన్ టీడీపీ అధ్యక్షుడు బడ్డ నాగరాజును హత్య చేసేందుకు బీహార్ నుంచి ముఠాను దించి దొరికిపోయిన ఘటనలో ఎస్పీ కేవీ మహేశ్వర్‌రెడ్డి నిందితులను మీడియా ముందు ప్రవేశపెట్టిన రోజే నగరంలో ఇంకా చీకటి పడకముందే శనివారం సాయంత్రం అత్యంత రద్దీగా ఉండే కిన్నెర థియేటర్ పక్కన హెడ్‌డీఎఫ్‌సీ ఏటీఎం కౌంటర్‌కు ఆనుకొని ఉన్న కోరాడ గోవింద్ (ప్రియా గోవింద్) ఇంటిలో కిరాయిమూకలు చొరబడి దోపిడీకి ప్రయత్నించిన ఘటన కలకలం రేపుతోంది. పలాసలో బడ్డ నాగరాజును హత్య చేయడానికి అక్కడి వైకాపా నాయకులు బీహార్ నుంచి ముఠాను దించినట్టే ఇక్కడ కోరాడ గోవింద్ ఇంటిలో దోపిడీ కోసం నగరంలో గూనపాలెంకు చెందిన పెద్దిన లక్ష్మణరావు తెలంగాణ నుంచి కిరాయి మనుషుల్ని రంగంలోకి దించినట్టు పోలీసులు గుర్తించారు. లేదూ అంటే భద్రాచలం నుంచి ఒకరు, నాగర్‌కర్నూల్ నుంచి ఇద్దరు, కొత్తగూడెంకు చెందిన మరొకరు ప్రియా గోవింద్ ఇంట్లో కత్తులు పట్టుకొని చొరబడ్డారంటే కచ్చితంగా దీని వెనుక స్థానికుల సహకారం ఉంటుందని పోలీసులు భావిస్తున్నారు. అందులో భాగంగానే





నిందితుడి నుంచి కూపీ లాగుతున్న వన్‌టౌన్ హెచ్‌సీ రవి

గూనపాలెంలో నివాసముంటున్న పెద్దిన లక్ష్మణరావును కూడా పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. వివరాల్లోకి వెళితే..

మార్కెట్ రోడ్ నుంచి కల్యాణి థియేటర్ వైపు వెళ్తున్న మార్గంలో కోరాడ గోవింద్ హోల్‌సేల్ వ్యాపారం నిర్వహిస్తున్నారు. కేఏఎన్ (కోరాడ ఆదినారాయణ (ట్రేడర్స్) పేరుతో కోరాడ గోవింద్ సోదరులు అనేక ఫుడ్ కంపెనీలకు డిస్ట్రిబ్యూటర్లుగా వ్యవహరిస్తున్నారు. అందులో ప్రధానమైనది ప్రియా ఫుడ్స్. అందుకే కోరాడ గోవింద్‌ను చాలా మంది వర్తకులు ప్రియా గోవింద్ అని కూడా పిలుస్తారు. ఈయనకు స్థానిక కిన్నెర థియేటర్ దాటిన తర్వాత హెడ్‌డీఎఫ్‌సీ ఏటీఎం సెంటర్‌కు ఆనుకొని మెయిన్ రోడ్డులోనే సొంత ఇల్లు ఉంది. గోవింద్‌తో పాటు ఆయన సోదరులిద్దరు కూడా ఇదే ఇంటిలో ఉమ్మడిగా ఉంటున్నారు. అయితే కోరాడ గోవింద్, ఆయన తమ్ముడు దివాకర్ ప్రియా ఫుడ్స్ డిస్ట్రిబ్యూషన్ వద్ద రోజంతా ఉంటారు. మరో సోదరుడు కూరగాయల మార్కెట్ గేటు ఎదురుగా కిరాణా వ్యాపారం నిర్వహిస్తుంటారు. ఇంటిలో రాత్రి వరకు గోవింద్ తల్లి, మహిళలు మాత్రమే ఉంటారు. ఈ విషయం తెలిసే శనివారం సాయంత్రం 7.20 గంటల ప్రాంతంలో కొందరు దుండగులు ఇంట్లోకి చొరబడి కత్తులతో బెదిరించి దోపిడీకి ప్రయత్నించారు. ప్రతీరోజు మాదిరిగా కాకుండా ఆ రోజు గోవింద్ ఇంటికి ఆయన సోదరుడి పిల్లలు కూడా బయటి నుంచి రావడంతో పెరటి నుంచి వచ్చిన ఓ దుండగుడ్ని లోనికి రాకుండా తలుపు వేయడం, ముందు డోర్ నుంచి వచ్చినవారిని నిలువరించడానికి మనుషులు ఉన్నారు. దీంతో దుండగులు పరారయ్యారు. హెడ్‌డీఎఫ్‌సీ బ్యాంకు ఏటీఎం సీసీల్లో నమోదైన ఫుటేజీ మేరకు నిందితుల్ని గాలించగా, గూనపాలెంలో గత కొద్దిరోజులుగా వీరు తచ్చాడుతూ కనిపించారని తెలిసింది. ఒక నిందితుడ్ని పోలీసులు అక్కడికక్కడే పట్టుకున్నారు. వీడిని సీసీఎస్, వన్‌టౌన్ పోలీసులు విచారిస్తే మిగిలినవారు విశాఖపట్నంలో శనివారం అర్ధరాత్రి దాటిన తర్వాత పోలీసులకు చిక్కారు. అయితే తెలంగాణకు చెందిన ఈ నలుగురూ శ్రీకాకుళంలో ఉన్న కోరాడ గోవింద్ ఇంట్లోకి చొరబడి దోచుకోడానికి ప్రయత్నించడం వెనుక చాలా రోజుల నుంచి రెక్కీ నిర్వహించినట్టు తెలుస్తుంది. వీరిని గూనపాలెంలో ఉంటున్న పెద్దిన లక్ష్మణరావు అనే వ్యక్తి తీసుకువచ్చి గత కొద్ది రోజులుగా ఆశ్రయం ఇచ్చాడని, కోరాడ గోవింద్ ఇంట్లో దోపిడీకి పాల్పడాలన్న స్కెచ్ కూడా ఆయనదేనన్న అనుమానాలు ఉన్నాయి. బత్తిలి దగ్గర జగన్నాథపురం పరిసర ప్రాంతానికి చెందిన పెద్దిన లక్ష్మణరావు మీద అనేక ఆరోపణలు ఉన్నాయి. గతంలో కూడా పక్క రాష్ట్రాల నుంచి మనుషుల్ని తెప్పించి ఇక్కడ దోపిడీలకు అవకాశమిచ్చి, దొంగసొత్తును చెరిసగం సర్దుకునేవారని కొందరు



చెప్పుకుంటున్నారు. అరవై ఏళ్లు పైబడ్డ పెద్దిన లక్ష్మణరావు ఆయన సామాజికవర్గానికి చెందినవారికి పెళ్లి సంబంధాలు చూస్తామని అందరి ఇంటికి వెళ్తుంటాడని, ఇందులో భాగంగానే ఎవరు ఎంత సౌండ్‌పార్టీయో తెలుసుకొని, ఆ తర్వాత దోపిడీకి ముఠాలను

- మిగతా 4లో



• ఎడిటోరియల్

# అమిత్ షా వ్యాఖ్యలపై వారి స్టాండేంటి?

పిల్లికి చెలగాటం, ఎలుకకు ప్రాణ సంకటంలా తయారైంది అమిత్ షా అంబేద్కర్‌ను ఉటంకిస్తూ పార్లమెంట్లో చేసిన లేకి వ్యాఖ్యల వల్ల ఆంధ్రప్రదేశ్లోని అన్ని పార్టీల నాయకులకు. గొంతులో పచ్చి వెలక్కాయ పడినట్టుగా పాపం దిగమింగుకోలేకపోతున్నారు. అంబేద్కర్‌ను ఏమన్నా కూడా ఓటు బ్యాంకు పరంగా బీజేపీకి పోయేదేమీ లేదు. నిజానికి పరోక్షంగా కొద్ది శాతం పెరుగుదల ఉంటుందేమో కూడా. అందుకనే నష్ట నివారణ చర్యలకు ఏమాత్రం పాల్పడకుండా ఎదురు దాడితో కాంగ్రెస్ మీద కాలు దువ్వుతూ తెగ రెచ్చిపోయారు మన మోడీ గారు కూడా. కాకపోతే ఆంధ్రాలోని పార్టీలు అధినాయకులకి ఆ వెసులుబాటు లేదు. ఎందుకంటే మాది బీసీల పార్టీ అని ఒకరు, ఎస్సీలు మాతోనే ఉంటారంటూ మరొకరు తెగ ఎగబడిపోతుంటారు. పాపం అందులో ఒకాయన మోడీకి బంధంలో ఉన్నాడు, మరొక ఆయన మోడీకి ఆత్మబంధువు. ఇంకొక ఆయన మోడీకి భక్తుడు. కాబట్టి వీళ్లంతా ఎటూ పాలుపోక ఆకాశం వైపు దిక్కులు చూస్తూ కూర్చున్నారు. ఇది ఇలా ఉంటే నన్ను కొడితే సరిపోతుందా, మా బామ్మర్దిని కొట్టొద్దా, నిజానికి అతనే దీనంతటికి కారణం అనేటట్టుగా ఆ ఢిల్లీ కేజ్రీవాలు మన చంద్రబాబుకి ఈ విషయం పట్ల మీ వైఖరి ఏంటో జాతికి చెప్పాలంటూ ఒక పెద్ద ఉత్తరం రాసేసాడు. జాతీయ నాయకుడిగా రూపాంతరం చెందాక అలాంటి ప్రశ్నలు కూడా ఎదురవుతాయి మన చంద్రబాబు గారికి, తప్పించుకుపోదామంటే కుదరదు మరి. నిజానికి మన రాష్ట్రంలో ఉన్న పార్టీలన్నీ బీజేపీ తానులో ముక్కలే. బీజేపీతో కలిసి వెళ్లడం కోసం గత ఎన్నికల్లో అమిత్‌షా కాళ్లు, గడ్డం పట్టుకున్నానని స్వయంగా పవన్‌కల్యాణే చెప్పడం ఇందుకు తార్కాణం. మొన్నటికి మొన్న జెమిలీ ఎన్నికల కోసం ఓటింగ్ జరిగితే, టీడీపీ ప్రభుత్వానికి అనుకూలంగా ఓటేసింది.. తప్పదు కాబట్టి. మరి జగన్ పార్టీ ఎందుకు జెమిలీకి అనుకూలంగా ఓటేసిందో తెలీదు. ఎవరూ అడగరు. కేంద్రంలో ఎన్డీయే ధైర్యం కూడా అదే. రాజ్యాంగ నిర్మాతను అవమానించేలా వ్యాఖ్యలు చేయడం దారుణమని, ఆయన తక్షణం క్షమాపణ చెప్పటంతో పాటు తన పదవి నుంచి వైదొలగాలని విపక్షాలు డిమాండ్ చేశాయి. పార్లమెంటు బయట పెద్దఎత్తున నిరసన తెలిపాయి. బుధ, గురువారాల్లో కూడా పార్లమెంటులోనూ, దేశవ్యాప్తంగానూ నిరసన కార్యక్రమాలు జరిగాయి. ‘అంబేద్కర్.. అంబేద్కర్.. అంబేద్కర్.. అంబేద్కర్ అనటం ఫ్యాషనైపోయింది. అదేదో వందసార్లు భగవంతుడి పేరు ఉచ్ఛరించినా స్వర్గలోకంలో స్థానం దొరుకుతుంది.’ అంటూ అమిత్ షా విపక్షాలపై విరుచుకుపడ్డారు. అంబేద్కర్ అధ్యక్షతన భారత రాజ్యాంగం రూపొందించుకొన్న తరుణంలో నేటి బీజేపీ మాతృసంస్థ అయిన రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్ (ఆర్‌ఎస్‌ఎస్) తీవ్ర అసంతృప్తిని వ్యక్తం చేసింది. తాము అత్యంత ప్రామాణికంగా భావించే మనుస్మృతికి స్థానం లేకుండా పోయిందే అని స్వయంగా గోల్వాల్కర్ తమ ‘ఆర్గనైజర్’ పత్రికలో వ్యాసాలు రాసుకున్నారు. దేశానికి ఈ రాజ్యాంగం పనికిరాదని, మూడు రంగుల జెండా అరిష్టమని పేర్కొనటమే కాదు.. కొంతమంది రాష్ట్ర ప్రేమి యువదళ్ కార్యకర్తలు 2021లో నాగ్‌పూర్ ఆర్‌ఆర్‌ఎస్ కార్యాలయం మీద బలవంతంగా మువ్వన్నెల జెండా ఎగురవేసేదాకా వాళ్లు జాతీయజెండాను గుర్తించలేదు. గత లోక్‌సభ ఎన్నికల తరుణంలో 400 సీట్లు సాధిస్తే రాజ్యాంగం మార్చి తీరుతామంటూ కొంతమంది బీజేపీ ఎంపీలు బాహాటంగా ప్రకటించిన సంగతి విదితమే! నోటితో నవ్వి నొసటితో వెక్కిరించిన తీరుగానే బీజేపీ అంబేద్కర్ పట్ల వ్యవహరిస్తూ ఉంటుంది. ఆయన విగ్రహానికి భారీగా పూలదండలు వేసి, ఘనంగా కబుర్లు చెప్పటం, రాజ్యాంగం నిర్దేశించిన విలువలను, రాజ్యాంగ సంస్థలను నిర్వీర్యం చేయడం ఆ పార్టీ కపట నీతి. మనుస్మృతి అత్యంత దుర్మార్గమైనదని, ఈ దేశానికి ఏమాత్రం పనికిరాదని అంబేద్కరే స్వయంగా దానిని దగ్ధం చేశారు. అలాంటి కాలం చెల్లిన క్రూరమైన మనువాదాన్ని నెత్తిన పెట్టుకొని, సనాతనమే తమ అభిమతంగా ఊరేగే బీజేపీగణం ఇక అంబేద్కర్ మహాశయుడి మార్గాన్ని ఎక్కడ గౌరవిస్తుంది? లోన ఒకటి బోధిస్తూ, అభిమానిస్తూ, బయట రకరకాల రంగులు మార్చే నటనా విన్యాసాలు చేయడం అధికార అవసరాలకు తగ్గట్టుగా అబద్ధాలకు తెగించటం ప్రభుత్వాలకు అలవాటే. వర్ణవ్యవస్థ విష వలయం నుంచి దేశం బయటపడాలన్న ఆధునాతన ఆచరణ అంబేద్కర్‌దైతే, దేశాన్ని మళ్లీ వెయ్యి పడగల విషపు నాగు నీడలోకి లాక్కుపోవడమే బీజేపీ సనాతన పన్నాగం. దీనికి ఈ రాష్ట్రంలో అన్ని పార్టీల మద్దతు ఉంది. వాస్తవానికి అమిత్ షా అంబేద్కర్‌ను ఎక్కడా తూలనాడలేదు. కాకపోతే ఈమధ్య అంబేద్కర్‌ను తమ సొంతం చేసుకోవాలని బీజేపీ భావిస్తుంది. దాన్ని గ్రహించిన కాంగ్రెస్ తమవాడంటూ క్లయిమ్ చేసుకోడానికి ప్రయత్నించడం వల్ల జరిగిన రాద్ధాంతమే గాని అంబేద్కర్ బతికిన రోజుల్లో ఇబ్బందులు పడింది కాంగ్రెస్ వల్లనేనని మర్చిపోకూడదు.





# కార్గిల్ విజయంలో.. ఓ గొర్రెల కాపరి!

ప్రతీ ఏటా జూలై 26న కార్గిల్ విజయ్ దివస్ చేసుకుంటున్నాం. దానికి సరిహద్దుల్లో మన సైనికులెంత కారణమో అసలా మొత్తం ఎపిసోడ్‌లో ఇండియన్ ఆర్మీని అలర్ట్ చేసిన ఓ వ్యక్తి అంతకంటే కీలకం. సదరు గొర్లకాపరి 58 ఏళ్ల వయస్సులో మృతి చెందడంతో బార్డర్ లోని సైనికవర్గాలతో పాటు.. పలువురు అతడికి శ్రద్ధాంజలి ఘటిస్తున్నారు. ఇంతకీ పాక్ పై విజయ భేరి మ్రోగించిన భారత విజయం వెనుక ఉన్న తాషి నాంగ్యాల్ కథేంటి..?

## 1999లో ఏం జరిగింది..? తాషి నాంగ్యాల్ కారకుడెలా అయ్యాడు..??

1991 యుద్ధం తర్వాత భారత్, పాక్ మధ్య చాలాకాలం పాటు ఉద్రిక్తతలు కొనసాగాయి. సియాచిన్ గ్లేసియర్ పైన నియంత్రణ సాధించేందుకు ఇటు భారత్, అటు పాక్ రెండు దేశాలూ తమ సైన్యాలను ఎత్తైన మంచుకొండల్లో మోహరించి ఔట్ పోస్టులు కూడా ఏర్పాటు చేసుకున్నాయి. 1998లో ఇరుదేశాలూ అణుపరీక్షలు చేయడంతో మరోసారి ఉద్రిక్తతలు తారాస్థాయికి చేరాయి. కానీ, 1999లో ఒక సానుకూల అడుగు పడింది. ఇరుదేశాల మధ్య లాహోర్ ఒప్పందం కుదిరింది. రెండు దేశాల మధ్య కశ్మీర్ సమస్యను చర్చల ద్వారా శాంతియుతంగా పరిష్కరించుకునేందుకు కుదిరిన ఎంఓయూనే లాహోర్ ఒప్పందం. కానీ, అది పాకిస్థాన్. సందు దొరికితే అటాకింగ్‌కు రెడీ. అలాంటి బుద్ధితో ద్వైపాక్షిక శాంతి ఒప్పందాలను తోసిరాజని.. 1999లో మళ్లీ పాక్ దళాలు ఎల్వోసీ దాటి భారత్‌లోకి ప్రవేశించాయి. కీలక ప్రాంతాలను ఆక్రమించుకున్నాయి. కానీ, భారత సైన్యం పాక్ కుట్రలను తిప్పి కొట్టింది. అప్రమత్తమైన భారత్ పాక్ ఏ మాత్రం ఎదురివ్వని రీతిలో ఏకంగా రెండు లక్షలకు పైగా సైనికులను కదనరంగంలోకి దింపింది. వీరోచితంగా పోరాడిన నాటి సైనికులు పాక్ ను పరారయ్యేలా చేశారు. అదే మనం ప్రతీ ఏటా జూలై 26న జరుపుకుంటున్న కార్గిల్ విజయ్ దివస్. 1999 మే నుంచి జూలై మధ్య ఈ మొత్తం ఎపిసోడ్ జరిగింది.

ఇదంతా సరే, రెండు లక్షలకుపైగా సైనికుల వీరోచిత పోరాటాలే విజయ్ దివస్‌గా జరుపుకోవడానికి ప్రధాన కారణమన్నదీ నిజమే. కానీ, అసలు ఇండియన్ ఆర్మీకి ఆ ఉప్పందించింది లడాఖ్‌కు చెందిన ఓ గొర్ల కాపరి. అతనే తాషి నాంగ్యాల్. తాషి నాంగ్యాల్ గొర్లమందలో కొన్ని గొర్లు తప్పిపోయాయి. వాటిని వెతికే క్రమంలో బటాలిక్ పర్వత శ్రేణిపై నుంచి ఎవరో కొందరు అపరిచిత వ్యక్తులు బార్డర్ దాటి వస్తున్నట్టు గమనించాడు. పైగా వారి బట్టలు, వారి గడ్డాలు, వారి చేతుల్లో ఆయుధాలతో కొంత అనుమానాస్పదంగా కనిపించేసరికి నాంగ్యాల్ సందేహపడ్డాడు. ఆ వెంటనే అక్కడున్న ఔట్ పోస్ట్ ఆర్మీ అధికారులకు సమాచారమిచ్చాడు. వెంటనే అలర్ట్ అయిన ఆర్మీ ఉన్నతాధికారులకు పరిస్థితి తీవ్రతను వివరించింది. ఇంకేం, ఏకంగా వేల మంది సైనికులు కదనరంగంలోకి దూకారు. లేకపోతే, సరిహద్దులు దాటి ఇండియన్ ఆర్మీ తేరుకునేలోపే జరగాల్సినంత బీభత్సం, నష్టం జరిగేది. అలా జరక్కుండా కాపాడాడు కాబట్టే.. ఈ శుక్రవారం డిసెంబర్ 20 తేదీ కన్నుమూసిన నాంగ్యాల్ కు పెద్దఎత్తున ఇండియన్ ఆర్మీ నివాళులర్పించింది. ఫైర్ అండ్ ఫ్యూరీ కార్ప్స్ ఎక్స్‌లో తాషీ నాంగ్యాల్‌కు నివాళులర్పించి ఆయన సేవలను కొనియాడింది. దేశానికి ఆయన సేవ అమూల్యమైందని ఆయనకు ఘనంగా శ్రద్ధాంజలి ఘటించింది. నాంగ్యాల్ పేరు విజయ్ దివస్ జరుపుకున్నన్ని రోజులు భారత్‌లో సువర్ణాక్షరాలతో లిఖించబడి ఉంటుందని పేర్కొంది. వారి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతిని వ్యక్తం చేసింది ఫైర్ అండ్ ఫ్యూరీ కార్ప్స్.

ఈ ఏడాది 2024 జూలైలో జరుపుకున్న 25వ కార్గిల్ విజయ్ దివస్ వేడుకలో కూడా.. ఇండియన్ ఆర్మీ ఆహ్వానం మేరకు వెళ్లి.. తన కూతురు సెరింగ్ డోల్కర్‌తో కలిసి నాంగ్యాల్ పాల్గొన్నాడు. కేంద్రపాలిత ప్రాంతమైన లడాఖ్ లోని గార్కాన్ ఆర్యన్ వ్యాలీలో నివశించేవాడు నాంగ్యాల్. ఆయన మృతిపై ఇండియన్ ఆర్మీతో పాటు, స్థానిక బీజేపీ ముఖ్య నేత జమ్యాంగ్ సెరింగ్ కూడా ఎక్స్‌లో తన సంతాపాన్ని ప్రకటించాడు. అలా ఓ సామాన్య పౌరుడైన నాంగ్యాల్ తన దేశభక్తిని చాటుకుని, దాయాది శత్రు దేశస్థుల నుంచి భారత్ ను రక్షించడంలోనూ, విజయం సాధించడంలో కీలకపాత్ర పోషించాడు గనుకే ఆ సామాన్యుడి గురించి ఈ ముచ్చట.

**Jamyang Tsering Namgyal**
@jtnladakh

Deeply saddened by the passing of Sh. Tashi Namgyal of Garkon, Ladakh. His courageous alert to the Army during the 1999 Kargil War was pivotal in defending India. A true unsung hero of Kargil, his legacy of patriotism will inspire generations. My Tribute & Heartfelt Condolences.



– బాతాఖానీ.కామ్ సౌజన్యంతో...




# అర్థం పర్థం లేని క్రియేటివిటీ!

**కథ:** సత్య (ఉపేంద్ర) తన చుట్టూ ఉన్న వాళ్లందరూ బాగుండాలని కోరుకునే వ్యక్తి. మంచి పనులు చేస్తూ.. కష్టంలో ఉన్న వాళ్లను ఆదుకుంటూ జనంలో మంచి ఆదరణ సంపాదించుకుంటాడు. ఇది కత్తెర శీనా (రవిశంకర్) అనే రాజకీయ నాయకుడికి నచ్చదు. ఎలాగైనా సత్య అడ్డంకి తొలగించుకోవాలని చూస్తుంటాడు. అదే సమయంలో సత్య పోలికలు ఉన్న మరో వ్యక్తి జనాలను నానా హింసలు పెడుతుంటాడు. సమాజంలో రకరకాల వ్యక్తులను తీసుకొచ్చి తనదైన శైలిలో శిక్షిస్తుంటాడు. జనం అతణ్ని కల్కి అవతారంగా భావిస్తారు. ఆ కల్కి.. సత్యను కూడా బంధించి తన గురించి అతడికి ఓ నిజం చెబుతాడు. ఆ నిజం ఏంటి.. ఇంతకీ కల్కి లక్ష్యమేంటి.. అతడి అకృత్యాలను సత్య ఆపగలిగాడా.. ఈ ప్రశ్నలకు తెర మీదే సమాధానం తెలుసుకోవాలి.

**నటీనటులు:**

ఉపేంద్ర తన అభిమానులను అల రించేలా క్రేజీగా కనిపించే ప్రయత్నం చేశాడు. విచిత్ర వేషధారణ.. విపరీత ప్రవర్తనతో సాగే పాత్రల్లో ఉపేంద్రను చూడ్డం అభిమానులకు ఇష్టం కాబట్టి తన పాత్ర వరకు బాగానే కనెక్ట్ అవుతారు. మిగతా ఆర్టిస్టులు కూడా ఉపేంద్ర దర్శకత్వ అభిరుచికి తగ్గట్లు నటించారు. రవిశంకర్ పాత్ర ఫన్నీగా అనిపిస్తుంది. కొన్ని చోట్ల నవ్విస్తుంది. ఆయన నటన బాగానే సాగింది. హీరోయిన్ రేష్మ నన్నయ తన ఉనికిని చాటుకునే అవకాశం రాలేదు. అసలు తన పాత్రేంటో.. అసలు సినిమాలో తనెందుకు ఉందో అర్థం కాదు. అచ్యుత్ కుమార్.. సాధు కోకిల పాత్రలు.. నటన గురించి చెప్పడానికేమీ లేదు. మిగతా ఆర్టిస్టులంతా మామూలే.

**సాంకేతిక వర్గం:**

‘మంగళవారం’.. ‘విరూపాక్ష’ సినిమాలతో తెలుగు ప్రేక్షకుల మనసు దోచిన సంగీత దర్శకుడు అజనీష్ లోక్‌నాథ్.. ‘యుఐ’లో తన మార్కు సంగీతం ఇవ్వలేకపోయాడు. అతను ఉపేంద్ర అభిరుచికి తగ్గ పాటలు-నేపథ్య సంగీతం అందించాడు. సోషల్ మీడియా పాపులర్ మీమ్స్ మీద చేసిన పాట ఒక్కటి బాగుంది. మిగతా పాటలేవీ అంతగా ఆకట్టుకోవు. నేపథ్య సంగీతం అంతటా కథాకథనాలకు తగ్గట్లు పిచ్చి సౌండ్లతో సాగిపోయింది. కొన్ని సౌండ్స్ వల్గర్ ఫీలింగ్ కలిగిస్తాయి. వేణుగోపాల్ ఛాయాగ్రహణం కూడా దర్శకుడి శైలికి తగ్గట్లు గజిబిజిగా సాగింది. నిర్మాణ విలువలు బాగున్నాయి. సినిమా రిచ్ గా తీశారు. రైటర్ కమ్ డైరెక్టర్ ఉపేంద్ర.. బుర్రలో ఏవేవో ఆలోచనలు ఉన్నాయి కానీ.. అవి రైటింగ్ పేపర్ మీదికి కూడా సరిగా రానట్లున్నాయి. ఇక తెరపైన అతను సృష్టించిన గందరగోళం అంతా ఇంతా కాదు. ఆరంభం నుంచి చివరిదాకా అసలు ఉపేంద్ర ఏం చెప్పదలుచుకున్నాడనే అయోమయంలోనే ఉంటాం. చివరికి ఈ గందరగోళం ఇంకా పెరిగి తలలు పట్టుకుని బయటికి వస్తాం.

**కథనం- విశ్లేషణ:**

ఓం.. ఎ.. ఉపేంద్ర.. సూపర్.. ఉపేంద్ర దర్శకత్వంలో వచ్చిన సంచలన చిత్రాలు. అతను అందరూ నడిచే దారిలో నడవడు. తన పాత్రలు-కథలు క్రేజీగా ఉంటాయి. రొటీన్‌కు భిన్నంగా ఆలోచిస్తూ.. ఎవ్వరూ చర్చించని విషయాలను.. బయటికి మాట్లాడలేని అంశాలను.. తన పాత్రలు-కథల ద్వారా చర్చించడం.. సన్నివేశాలను క్రేజీగా తీర్చి దిద్దడం ద్వారా దర్శకుడిగా తనకంటూ ఒక ప్రత్యేకమైన అభిమాన గణాన్ని సంపాదించుకున్నాడు ఉపేంద్ర. ఐతే గతంలో అతను తీసిన కథల్లో కొత్తగా ఏం చెప్పాలని చూసినా.. అందులో ఒక క్లారిటీ ఉండేది. చెప్పుకోవడానికి ఒక కథ.. దాన్ని నరేట్ చేయడానికి ఒక స్క్రీన్ ప్లే.. అర్థవంతమైన పాత్రలు కనిపించేవి. ఈ పరిధిలో ఉంటూనే కొత్తగా ఏదో చెప్పడానికి ప్రయత్నించేవాడు. కానీ ‘ఉపేంద్ర’ సినిమాకు సీక్వెల్ తీసినపుడు ఉప్పి క్రియేటివిటీ హద్దులు దాటిపోయింది. తనేం రాస్తున్నాడో.. ఏం తీస్తున్నాడో తెలియని అయోమయంలో ప్రేక్షకులను తీవ్ర గందరగోళానికి గురి చేసి చేదు అనుభవాన్ని ఎదుర్కొన్నాడు. ఇప్పుడు ‘యుఐ’తో ప్రేక్షకులకు మరోసారి కఠిన పరీక్ష పెట్టాడు. క్రియేటివిటీ పేరుతో అర్థం పర్థం లేని కథ రాసి.. ఒక పద్ధతీ పాడూ లేకుండా ఇష్టం వచ్చినట్లు దాన్ని నరేట్ చేసి.. ఏం అర్థం చేసుకుంటారో.. ఎలా ఎంటర్టైన్ అవుతారో మీ ఇష్టం అన్నట్లుగా స్క్రీన్ మీదికి వదిలేశాడు. ఆరంభం నుంచి చివరి దాకా అసలీ కథేంటి.. పాత్రలేంటి.. ఉపేంద్ర అసలేం చెప్పదలుచుకున్నాడు అని... బుర్ర బద్దలుకోవడం తప్పితే ఇందులో ఆస్వాదించడానికి పెద్దగా ఏమీ లేదు. కొన్ని క్రేజీ సీన్లు.. డైలాగులు అక్కడక్కడా కొంత నవ్వించినప్పటికీ.. ఇదొక బ్రహ్మపదార్థం లాంటి సినిమానే.

ప్రేక్షకులకు అన్నీ విడమరిచి చెప్పాల్సిన అవసరం లేదన్నది దర్శకుడు ఉపేంద్ర ఉద్దేశం కావచ్చు. కానీ సినిమా అన్నాక ఒక నిర్దిష్టమైన కథ.. దాన్ని అర్థవంతంగా చెప్పే కథనం అవసరం. ఏ పాత్ర ఏంటో అని అయినా అర్థం కావాలి. ఒక సన్నివేశానికి.. ఇంకో సన్నివేశానికి సంబంధం ఉండాలి. కథలో ఒక కంటిన్యూటీ కనిపించాలి. దర్శకుడు అసలేం చెప్పదలుచుకున్నది ఆలోచిస్తే అయినా అర్థం కావాలి. నర్మగర్భంగా విషయం చెప్పడం వేరు. మనసులో ఏదో అనుకుని.. దాన్ని పేపర్ మీద ఇంకోలా రాసి.. తెర మీద ఇంకోలా ప్రెజెంట్ చేసి.. నా ఉద్దేశమేంటో డీకోడ్ చేసి అర్థం చేసుకో అని ప్రేక్షకులకు పజిల్ పెట్టడంలో ఔచిత్యమేంటో ఉపేంద్రనే చెప్పాలి. తన క్రియేటివిటీని.. ఫిలాసఫీలను తక్కువ చేయడం కాదు కానీ... యుఐ సినిమాలో అతను చూపించిన వైవిధ్యమంతా ఒక వ్యర్థ ప్రయత్నమే అయింది. ఎక్కడా కుదురుగా కథను చెప్పకపోవడం.. విపరీతమైన గందరగోళంతో సన్నివేశాలు సాగడం వల్ల ఏ దశలోనూ ఈ సినిమాను ఆస్వాదించలేని పరిస్థితి. కథ-పాత్రలే అర్థం కానపుడు సన్నివేశాల్లో కొంత వినోదం ఉన్నప్పటికీ వాటిని ఎలా ఎంజాయ్ చేయగలం? యుఐ సినిమాలో ఇంట్రెస్టింగ్ ఎపిసోడ్ అంటే.. చివర్లో చూపించే భవిష్యత్ చిత్రమే. మనిషి చేసిన తప్పుల ఫలితంగా కొన్ని దశాబ్దాల తర్వాత ప్రపంచం ఎలా ఉండబోతోందో చూపిస్తూ సెటైరికల్‌గా ఆ ఎపిసోడ్‌ను ఉపేంద్ర తీర్చిదిద్దిన తీరు చాలా బాగుంది. అందులో సన్నివేశాలు.. డైలాగులు భలే అనిపిస్తాయి. సినిమాలో కొంచెం కుదురుగా.. అర్థవంతంగా సాగే ఎపిసోడ్ ఇదొక్కటే. యుఐ మూవీలో ఇదే బెస్ట్ అని ఉపేంద్రకు కూడా అర్థమైంది కాబట్టే దీన్నే ట్రైలర్‌గా వదిలాడు. అది చూసి ప్రేక్షకులు ఏవో అంచనాలతో ప్రేక్షకులు థియేటర్లకు వెళ్తే అతను ఇంకేదో సినిమా చూపించాడు. లోతైన ఫిలాసఫీలు చెప్పాలని ఉపేంద్ర ప్రయత్నించాడు కానీ.. అవి అర్థం చేసుకునే శక్తి, ఓపిక ప్రేక్షకులకు ఉండవు. తన గజిబిజి నరేషన్ ప్రేక్షకుల శక్తి.. ఓపిక నశించిపోయేలా చేస్తాయి మరి. రేప్పొద్దున సినిమాను మళ్లీ మళ్లీ చూసి హిడెన్ డీటైల్స్ బయటికి తీసి.. ఉప్పి బ్రిలియన్స్ ఇదీ అంటూ కొందరు ఊదరగొట్టొచ్చు. కానీ ప్రేక్షకులకు అర్థం కాని విధంగా.. అత్యంత గందరగోళంగా ఈ కథను నరేట్ చేయడం ఉపేంద్ర తప్పే అవుతుంది తప్ప.. ప్రేక్షకులను మాత్రం నిందించడానికి వీల్లేదు. ఎంత ఇంటలిజెన్స్ ఉన్న ప్రేక్షకులకైనా పరీక్ష పెట్టి అసహనానికి గురి చేసేలా యుఐ మూవీ సాగుతుంది. ఈ హెచ్చరిక తర్వాత కూడా యుఐ మూవీ చూసి ఏదైనా డీకోడ్ చేసే ప్రయత్నం చేయాలనుకుంటే అది ప్రేక్షకుల ఛాయిస్.

– తుపాకి.కామ్ సౌజన్యంతో...



వ్యక్తిస్వామ్యం, ప్రజాస్వామ్యం అన్న మాటలున్నట్లు తోపులాటస్వామ్యం అన్న మాట వాడుకలో లేదు కానీ ప్రజాప్రతినిధుల స్వభావంలో, పనితీరులో మాత్రం ప్రబలంగా ఉంటుంది. కొట్టొచ్చినట్లుగా కాకుండా కొట్టడానికే వచ్చినట్లు స్పష్టంగా కనపడుతుంటుంది! తోపులాట తెలుగుస్వామ్యం సంస్కృతం కాబట్టి ఇది దుష్టసమాసమవుతుందని వ్యాకరణవేత్తల ఛాందస చర్చకు ఈరోజుల్లో విలువలేదు. అంతటి ఎన్‌టీఆరే మహా సంస్కృతం నాడు తెలుగు కలిపి "మహానాడు" అని దుష్టసమాసాన్ని శిష్టప్రయోగం చేసి తెలుగు జాతికి ఇచ్చి వెళ్ళాక ఇప్పుడు దుష్టప్రయోగాల గురించి అనుకునేవారెవరు? అయినా తోపులాటలో ఉన్నదే కండబలం మొరటుతనం దూకుడు బలప్రదర్శన అయినప్పుడు దుష్ట-శిష్ట చర్చకు ఆస్కారం ఉండదు. కొంచెం డొంకతిరుగుడుగా ఉన్నా ముందు ఒక కల్పితకథలోకి వెళ్ళి తరువాత అసలు విషయంలోకి వెళదాం.



# ప్రజాస్వామ్యం పలాయనం చిత్తగించింది!

సునిశితమయిన హాస్యంతో గుండెలు మెలిపెట్టే విషయాలను చెప్పడంలో చెయి తిరిగిన రచయిత జిఆర్ మహర్షి దాదాపు దశాబ్దం క్రితం ప్రజాస్వామ్యం మీద ఒక వ్యంగ్య వ్యాఖ్య రాశారు. అందులో - సాధారణ ఎన్నికల ప్రచారం హోరెత్తుతూ ఉంటుంది. సభలు, ర్యాలీలు, మైకులు, నినాదాలు, పొగడ్తలు, తిట్లతో ఊరూ వాడా ఊగిపోతూ ఉంది. ఒక ఊరి పక్కన అడవిలో జంతువులకు ఈ ఎన్నికల హడావుడి అంతా విచిత్రంగా అనిపిస్తుంది. ఏమిటిదంతా అని ఆరా తీస్తాయి. ప్రజాస్వామ్య సంవిధానంలో ఎన్నికలు కీలకం అని తెలిసి అడవిలో "ఆటవిక పాలన" అన్న నింద తొలగించుకోవాలంటే ఎన్నికలకు



వెళ్లడమే ఉత్తమం అని జంతువులన్నీ ఏకగ్రీవంగా అంగీకారానికి వస్తాయి.

సింహం మొదలు చీమ దాకా దేన్నీ వదలకుండా ఓటరు నమోదు జరుగుతుంది. గుంట నక్క రిటర్నింగ్ అధికారిగా ఒకానొక శుభ ముహూర్తాన పోలింగ్ జరుగుతుంది. ఏనుగు నుండి పిపీలికం దాకా అన్నీ క్యూలో నిలుచుని ఓట్లు వేశాయి. నిర్ణయించిన ముహూర్తానికి పోలింగ్ ఫలితాలు ప్రకటించడమే ఇక తరువాయి.

విప్పిన బ్యాలెట్ బాక్సులతో పాటు అన్నీ కలిసి సింహం గుహ దగ్గరికి వెళతాయి. సరిగ్గా అదే సమయానికి సింహం నిద్రపోతూ ఉంటుంది. నిద్ర పూర్తయి నెమ్మదిగా సింహం కళ్లు తెరిచి ఏమిటి మొత్తం అంతా కట్టకట్టుకుని వచ్చారు? అని అడుగుతుంది. ఏమీ లేదు మహారాజా! మొన్న పోలింగ్ జరిగింది కదా? మీరు అనుమతిస్తే ఫలితాలు ప్రకటిస్తాం.. అని భయభక్తులతో తగ్గ స్వరంతో మనవి చేసుకున్నాయి. అలాగే ప్రకటించండి.. ఎలాగూ అడవికి నేనే కదా రాజును? అని సింహం ఆవులిస్తూ చెప్పింది.

"సింహం ఆవులించి నిద్ర లేచింది. ప్రజాస్వామ్యం పలాయనం చిత్తగించింది" అని ముగించారు జి ఆర్ మహర్షి.

ఇందులో అంతరార్థం ఏమిటో వివరించాల్సిన పనిలేదు. అర్థం చేసుకున్నవారికి చేసుకున్నంత.



ఈ కథ కల్పితం, జరగలేదు అనుకుని కొట్టిపారేయకండి. తేలిగ్గా తీసుకోకండి. తాజాగా పార్లమెంటు మకరద్వారం దగ్గర అధికార-ప్రతిపక్ష పార్లమెంటు సభ్యుల తోపులాటను ఈ కల్పిత కథకు అన్వయించుకోవాలి!

మకరం అంటే మొసలి. అంతటి ప్రజాస్వామ్య దేవాలయ ప్రధాన ద్వారానికి పశుబల పరిభాషే ఉందని నిట్టూర్చాల్సిన పనిలేదు. మొసలి గజేంద్రుడిని పట్టుకుంటే వెయ్యేళ్ళు ఏడ్చి ఏడ్చి చివరకు ఏడవలేక మూర్ఛపోతుంటే అప్పుడు శ్రీమహావిష్ణువు వచ్చి కాపాడాడు. అది గజేంద్ర మోక్షణం అయ్యింది. దేశాన్ని పట్టుకున్న దరిద్రాలను తుంచి వేయడానికి చట్టాలు చేసే చోటు కాబట్టి ఇది ప్రజాస్వామ్య మోక్షణం అవుతుంది. అందుకోసం ప్రతీకాత్మకంగా మకరద్వారం పెట్టి ఉంటారనుకుంటే సరి!

ఎంతటి మొసళ్ళయినా నీళ్ళల్లో ఉంటేనే బలం. పార్లమెంటు కొత్త భవనం ముఖద్వారం దగ్గర ఉంటే ఈగకూడా లోకువే!

బాధ్యతగల ఎంపీల తోపులాటలు, తొక్కిసలాటలు, ఎముకలు విరగడాలు, కాలు బెణకడాలు చూసి పార్లమెంటు మకరద్వారంలో మొసలి మొసలి కన్నీళ్ళు కాకుండా నిజం కన్నీళ్ళే కార్చింది. కానీ మొసలి కన్నీళ్ళను లోకం సీరియస్‌గా తీసుకోకపోవడం వల్ల వాటికి కన్నీటిగా గుర్తింపు దక్కదు- అంతే!

ఒకపనిని సవ్యంగా చేయలేనప్పుడు, ఒక చర్చను హుందాగా కొనసాగించలేనప్పుడు విసుక్కుని, కోప్పడి, చిందరవందర చేసి వెళ్ళిపోయే సందర్భాల్లో "శేషం కోపేన పూరయేత్" అని సంస్కృతంలో అద్భుతమైన మాట.

పార్లమెంటు లోపల చర్చ. ఆ చర్చలోకి అంబేద్కర్ వచ్చాడు. ఆ సందర్భంలో అంబేద్కర్‌ను హోంమంత్రి అమిత్ షా అవమానించారని ప్రతిపక్షాలు బతికి ఉన్నప్పుడు అంబేద్కర్‌ను అవమానించిన కాంగ్రెస్ తరువాత ఆయన భజన చేస్తోందని బీజేపీ విమర్శించుకున్నాయి. పార్లమెంటును దాటి ప్రకంపనలకు ఆస్కారమున్న విషయం కాబట్టి అధికార-ప్రతిపక్ష సభ్యులు "శేషం కోపేన పూరయేత్" మార్గాన్ని ఎంచుకున్నారు.

**ఎవరు ఎవరిని తోశారు?**
**ఎవరు ఎవరికి మోకాలు అడ్డు పెట్టారు?**
**ఎవరి మోకాలి చిప్ప విరిగింది?**
**ఎవరి తుంటి ఎముకలో పగుళ్ళు వచ్చాయి?**
**రక్తం ఎన్ని చుక్కలు కారింది?**

అన్నవి ఇప్పుడు గంభీరమైన ప్రజాస్వామిక చర్చలు. సహజంగా అంబేద్కర్ అంశం పక్కకుపోయి సభ్యుల తుంటి ఎముకల హెయిర్ లైన్ ఫ్రాక్చర్, నుదుటి రక్తంబొట్ల కాటన్ బ్యాండేజ్ కట్ల అంశం చర్చకు వస్తుంది. అలాగే వచ్చింది కూడా.

అక్కడ జిఆర్ మహర్షి కల్పిత కథలో గుహ సింహద్వారం దగ్గర సింహం ఆవులించి నిద్రలేస్తే ప్రజాస్వామ్యం భయంకొద్దీ పలాయనం చిత్తగించింది!

**ఇక్కడ నిజజీవితంలో నిండుసభ మకరద్వారం దగ్గర ప్రజాస్వా మ్యం ప్రజాస్వామిక వాతావరణంలో చర్చించుకోలేక ఎముకలు విరగ్గొట్టుకుని బాధతో పలాయనం చిత్తగిస్తోంది! దేశమా! సిగ్గుపడు!**

**-పమిడికాల్వ మధుసూదన్**

---

## విద్యార్థుల సర్వతోముఖాభివృద్ధికి బాటలు

**- జిల్లా విద్యాశాఖ అధికారి తిరుమల చైతన్య -**



(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

విద్యార్థులలో నైతిక విలువలు పెంపొందించడంలో భారత స్కౌట్స్ అండ్ గైడ్స్ కీలక పాత్ర పోషిస్తుందని జిల్లా విద్యాశాఖాధికారి డాక్టర్ తిరుమల చైతన్య అన్నారు. జిల్లాలోని వివిధ స్కౌట్ మాస్టర్లు, గైడ్ కెప్టెన్లకు డిసెంబర్ 16 నుండి 22 వరకు వారం రోజుల పాటు జరిగిన ప్రత్యేక శిక్షణ కార్యక్రమం ముగింపు సందర్భంగా ఆదివారం ఆయన మాట్లాడుతూ ప్రతి పాఠశాలలో భారత స్కౌట్స్ అండ్ గైడ్స్ కార్యక్రమాలను ప్రారంభించాలని సూచించారు. విద్యార్థుల సర్వతోముఖాభివృద్ధికి స్కౌట్స్ అండ్ గైడ్స్ కార్యక్రమాలు ఎంతో ఉపయోగపడతాయని, విద్యార్థులు సమాజ సేవ, నాయకత్వ లక్షణాలు, క్రమశిక్షణ వంటి విలువలను నేర్చుకుంటారని చెప్పారు. స్కౌట్స్ అండ్ గైడ్స్ కార్యక్రమాలు విద్యార్థులలో ఆత్మవిశ్వాసాన్ని పెంపొందిస్తాయని అన్నారు. శ్రీకాకుళం భారత స్కౌట్స్ అండ్ గైడ్స్ భవనంలో జరిగిన ఈ శిక్షణలో 36 మంది స్కౌట్ మాస్టర్లు, 33 మంది గైడ్ కెప్టెన్లు పాల్గొన్నారు. వివిధ రంగాల నిపుణులుగా ఉన్న డి.ఎల్.నారాయణ, బి.శివనాగిరెడ్డి, కె.దుర్గానాగేశ్వరరావు, పి.సుశీల, జి.బుజ్జిబాబు, రాజేశ్వరి, ప్రమీలలు ఈ శిక్షణను నిర్వహించారు. జిల్లా విద్యాధికారి డాక్టర్ ఎస్.తిరుమల చైతన్య, భారత స్కౌట్స్ అండ్ గైడ్స్ సెక్రటరీ జి. రాజేంద్రప్రసాద్, జాయింట్ సెక్రటరీ వి.వాగ్దేవి, ఉపవిద్యాధికారి విజయకుమారి వంటి ప్రముఖులు ఈ కార్యక్రమాన్ని పర్యవేక్షించారు. శిక్షణ ముగింపు కార్యక్రమంలో రెడ్‌క్రాస్ చైర్మన్ పి.జగన్మోహనరావు, నిక్కు అప్పన్న తదితరులు పాల్గొన్నారు.

---

## ఏలోహిం చర్చిలో క్రిస్మస్ వేడుకలు

(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

స్థానిక ఏలోహిం చర్చి ప్రాంగణంలో సిక్ అండ్ సేవ్ సేవా ఫౌండేషన్ ఆధ్వర్యంలో క్రీస్తు జనన దిన వేడుకలు ఘనంగా నిర్వహించారు. ముందుగా ఫౌండేషన్ ప్రతినిధి, సీనియర్ ఫిజియోథెరపిస్ట్ డాక్టర్ శ్రీనివాస్ పట్నాయక్ మాట్లాడుతూ ఏసుక్రీస్తు చూపిన ప్రేమ, సహోదర ఐక్యత నేటి సమాజానికి ఎంతో అవసరమన్నారు. క్రీస్తు పుట్టుక మహోన్నతమైనదని అన్నారు. పాస్టర్ ఎన్.సురేష్ ఐజాక్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ఎన్.రిబ్కా పాస్టర్, జుత్తుక కృపావరం ఐజాక్, డాక్టర్ కరకవలస వినీల బాయ్ పట్నాయక్, ఎవెంజెలిస్ట్ వెంకట గౌరీ, సుమ, దివ్య, చరణ్ తదితరులు ప్రసంగించారు. ఈ సందర్భంగా క్రీస్తుపై గీతాలు ఆలపించారు. వితంతువులు, వృద్ధులకు వస్త్రాలు, కేకులు, బిస్కెట్లు, పండ్లు పంపిణీ చేశారు.




---

## 'మోస్ట్ అడ్మైర్డ్ అకడమిక్ అడ్వైజర్' అవార్డు అందుకున్న వెంకటరమేష్



(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

శ్రీకాకుళానికి చెందిన పి.వెంకటరమేష్‌కు ఆసియా టుడే మీడియా ప్రైవేట్ లిమిటెడ్ ప్రతిష్టాత్మకమైన 'మోస్ట్ అడ్మైర్డ్ అకడమిక్ అడ్వైజర్' అవార్డును ప్రదానం చేసింది. హైదరాబాద్‌లోని తాజ్ డెక్కన్‌లో జరిగిన ప్రైడ్ ఆఫ్ నేషన్ అవార్డ్స్ 2024 వేడుకల్లో ఈ అవార్డును తెలంగాణ రాష్ట్ర గవర్నర్ జిష్ణు దేవ్‌వర్మ అందజేశారు. ఈ వేడుకకు బీజేపీ తెలంగాణ అధ్యక్షుడు, ఎంపీ బంగారు లక్ష్మణ్, ఎంపీలు ఈటెల రాజేందర్, రఘునందన్‌రావుతో సహా ప్రముఖులు హాజరయ్యారు. పి.వెంకటరమేష్ ఆంధ్రప్రదేశ్, తెలంగాణతో సహా 6 రాష్ట్రాలలో వివిధ ఇంజనీరింగ్ కళాశాలల్లో విశ్వసనీయ విద్యాసలహాదారుగా తన పాత్ర ద్వారా విద్యారంగానికి గణనీయమైన కృషిచేసారు. అతని పని విద్యార్థులు, అధ్యాపకులు, సంస్థలపై తీవ్ర ప్రభావం చూపి అతనికి ఈ గుర్తింపు వచ్చింది. ఆసియా టుడే మీడియా ప్రైవేట్ లిమిటెడ్ అందించిన ఈ అవార్డు, అకడమిక్ ల్యాండ్‌స్కేప్‌పై అతని తిరుగులేని నిబద్ధత, అంకితభావం, పరివర్తన ప్రభావాన్ని హైలైట్ చేస్తుంది. అలాగే రమేష్ మన్యం జిల్లాలో మూడు గ్రామాలను దత్తత తీసుకోవడంతో పాటు 50 మందికి విద్యను అందించడంలో సహాయం చేస్తున్నారు.

---



## రక్తదాతలు ప్రాణదాతలు

**ఎమ్మెల్యే గొండు శంకర్ । ముస్లిం మతపెద్దల ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం**

(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

రక్తదాతలు ప్రాణదాతలతో సమానమని ఎమ్మెల్యే గొండు శంకర్ అన్నారు. నగరంలోని జామియా మసీదులో ముస్లిం మతపెద్దల ఆధ్వర్యంలో ఆదివారం రక్తదాన శిబిరం నిర్వహించారు. రెడ్‌క్రాస్ సంస్థ జరిపిన ఈ రక్తదాన శిబిరంలో సుమారు 80 మంది రక్తదానం చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే శంకర్ మాట్లాడుతూ జిల్లాలో రక్తం కొరత అధికంగా ఉందని, యువత, విద్యార్థులు ముందుకు వచ్చి రక్తదానం చేయాలని పిలుపు ఇచ్చారు. రక్తదానం చేయడం వలన ఆరోగ్యం మరింతగా మెరుగుపడుతుందని చెప్పారు. అపోహలు వీడి ప్రతిఒక్కరూ ఏడాదికి రెండుసార్లు రక్తదానం చేసి ప్రాణాపాయ స్థితిలో ఉన్నవారికి ప్రాణదానం చేయాలని కోరారు. స్వచ్ఛందంగా ముస్లిం మత పెద్దలు ఇటువంటి రక్తదాన కార్యక్రమం నిర్వహించడాన్ని అభినందించారు. ఈ కార్యక్రమంలో రెడ్‌క్రాస్ చైర్మన్ జగన్మోహన్‌రావు, జామియా మసీదు అధ్యక్షులు మహిబుల్లా ఖాన్, అఖిల భారత మానవతా సందేశ సమితి (ఏఐపీఐఎఫ్) ఆధ్వర్యంలో మూడు జిల్లాల కన్వీనర్ అబ్దుల్ కలామ్, సలీమ్, ముజీబ్, హాజి షానవాజ్, హాజి అలీజాన్, హాజి అమీరుల్లా బేగ్, సలీమ్‌ఖాన్, హాజీభయ్యా, అక్బర్ బాషా, సుకుర్ ఖాన్, ఉస్మాన్, సయ్యద్ షఫి, అబ్దుల్, ముబారక్, రోషన్ బాషా, ఎంఎ రజాక్, యూసుఫ్, బహదూర్ బాషా, నిజామ్, బహదూర్ జానీ, శైలానీ, ఖాదర్ తదితరులు పాల్గొన్నారు.



ఎం.ఇర్షాద్
USHA ఆథరైజ్డ్ డీలర్స్
షాప్: 08942-229343
సెల్: 95731 43409
ఎ.కె. ఎంటర్‌ప్రైజెస్
ఉషా సెవింగ్ మిషన్స్, ఆఫీస్ ఫర్నిచర్..
అన్ని రకాల సెవింగ్ మిషిన్లు, ఫేషన్ మేకర్స్, ఎంబ్రాయిడరీ మిషిన్లు, స్పేర్స్ హోల్‌సేల్
రాజా కాంప్లెక్స్, కరెంట్ ఆఫీసు ఎదురుగా, జి.టి. రోడ్డు, శ్రీకాకుళం - 532 001

మెట్రో సోఫా వర్క్స్
అన్ని రకముల సోఫాలు, ఫర్నిచర్ మేనుఫేక్చర్స్ (హోల్‌సేల్ & రిటైల్)
షాపు నెంబరు 1, కొన్నవీధి, వన్‌వే ట్రాఫిక్ రోడ్డు, మాధవ మోటార్స్ దరి, శ్రీకాకుళం
సెల్: 83094 81129

SSJ
శ్రీ స్వర్ణ జ్యూయలరీ
ప్రొ॥ వాళ్ళ కిరణ్‌కుమార్
99636 89666, 90009 07133
జి.టి. రోడ్డు, శ్రీకాకుళం
E-mail: sriswarnajewelleries@gmail.com

SAI OPTICIANS
సరస్వతి మహల్ ఎదురుగా, శ్రీకాకుళం
ప్రొప్రయిటర్: బి.రమణమూర్తి
సెల్: 94407 59739
బ్రాంచ్ ఆఫీస్: గవర్నమెంట్ ఆర్ట్స్ కాలేజ్ రోడ్డు, శ్రీకాకుళం, సెల్: 94407 59739

Siva Srinivasa
Sofa Emporium
Lade Chandra Sekhar Rao
Ph. No: 94401 21710
63053 35395, sekharlifestyle99@gmail.com
NEAR SURYA MAHAL THEATRE
WOMEN'S COLLEGE ROAD,
SRIKAKULAM - 532 001

# రథసమప్తమికి శారదా పీఠం దూరం

◆ పట్టువస్త్రాలు అందించే సంప్రదాయానికి చెక్

◆ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు




(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

వచ్చే ఏడాది ఫిబ్రవరి 4న జరగనున్న రథసప్తమి వేడుకలకు శారదా పీఠాధిపతులు దూరం కానున్నారు. ఎన్నో ఏళ్లుగా ఆదిత్యునికి పట్టువస్త్రాలు అందిస్తూ వచ్చిన వస్తున్న సంప్రదాయినికి ఈ ఏడాది నుంచి రాష్ట్ర ప్రభుత్వం చెక్ పెట్టింది. కూటమి ప్రభుత్వం రథసప్తమి వేడుకలను రాష్ట్ర వేడుకగా చేస్తూ ఇటీవల ఉత్తర్వులు జారీ చేయడం వల్ల శారదా పీఠాధిపతులు పట్టువస్త్రాలు అందించే అవకాశాన్ని కోల్పోయారని వ్యవసాయశాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు ప్రకటించారు. వారి స్థానంలో దేవదాయ శాఖ, లేదంటే జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి, కాదంటే జిల్లాలో సీనియర్ మంత్రి ఆదిత్యునికి రథసప్తమినాడు పట్టువస్త్రాలు అందిస్తారని మంత్రి అచ్చెన్నాయుడు వెల్లడించారు. సోమవారం కలెక్టరేట్‌లో ఎమ్మెల్యే గొండు శంకర్, కలెక్టర్ స్వప్నిల్‌దినకర్, జేసీ ఫర్మాన్ అహ్మద్‌ఖాన్, ఎస్పీ కేవీ మహేశ్వరరెడ్డితో కలిసి రథసప్తమి వేడుకలపై వివిధ శాఖల అధికారులతో మంత్రి సమీక్షించారు. రథసప్తమి వేడుకలను రాష్ట్ర వేడుకగా అంగరంగ వైభవంగా నిర్వహిస్తున్నట్టు తెలిపారు. మూడు రోజుల పాటు ఈ వేడుకలను నిర్వహిస్తున్నందున ఆదిత్యుని దర్శనానికి భారీ సంఖ్యలో భక్తులు వచ్చే అవకాశం ఉందన్నారు. భక్తులకు అసౌకర్యం కలగకుండా అన్ని ఏర్పాట్లు చేయనున్నట్టు తెలిపారు. పార్కింగ్, క్యూలైన్‌లు దేవాలయానికి సమీపంలోనే ఏర్పాటు చేయడానికి ఉన్న అవకాశాలను పరిశీలిస్తున్నట్టు తెలిపారు. సాధారణ భక్తులకు ఇబ్బంది లేకుండా క్యూలైన్లు ఏర్పాటు చేస్తున్నట్టు తెలిపారు. దాతలు, వీవీఐపీ, వీఐపీ భక్తుల కోసం ప్రత్యేక క్యూలైన్లు ఏర్పాటు చేయడానికి నిర్ణయించినట్టు తెలిపారు. ప్రత్యేక దర్శనానికి వచ్చే దాతలు వారి వివరాలను ముందుగా దేవాలయం ఈవో వద్ద నమోదు చేసుకోవాలని సూచించారు. రూ.500 పాస్‌లను జారీ చేసి క్యూఆర్ కోడ్ ద్వారా దర్శనానికి అనుమతించాలని ఆలోచన చేస్తున్నట్టు తెలిపారు. మూడు రోజుల పాటు నిర్వహించే ఈ వేడుకల్లో సాంస్కృతిక కార్యక్రమాలు, గ్రామీణ క్రీడాపోటీలు నిర్వహించనున్నట్టు తెలిపారు. సాంస్కృతిక కార్యక్రమాలను నగరంలోని ఎన్టీఆర్ మున్సిపల్ మైదానంలో నిర్వహించడానికి ఏర్పాట్లు చేస్తున్నట్టు తెలిపారు. శ్రీకాకుళం నగరంలోని అన్ని ప్రధాన కూడళ్లను కలుపుతూ అరసవల్లికి వచ్చే మార్గాలన్నీ విద్యుదీకరణతో అలంకరించనున్నట్టు తెలిపారు. నగరంలో కొన్నిచోట్ల లైటింగ్‌తో విగ్రహాలు ఏర్పాటు చేయడానికి ఉన్న అవకాశాలను పరిశీలిస్తున్నట్టు తెలిపారు. వేడుకలకు మరింత హంగులు సమకూరేలా బాణసంచాను వెలిగించే కార్యక్రమాన్ని ఏర్పాటు చేస్తున్నట్టు తెలిపారు. ఆయనే స్వయంగా పరిశీలించి ఏర్పాట్లను సమీక్షిస్తుంటానని తెలిపారు. అధికారులు రథసప్తమి వేడుకలను ప్రతిష్టాత్మకం తీసుకొని విజయవంతమయ్యేందుకు పూర్తి సహాయ సహకారాలు అందించాలని సూచించారు. సమావేశంలో ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి, కింజరాపు హరిప్రసాద్, మిల్లర్స్ అధ్యక్షుడు బోయిన రమేష్, వివిధ శాఖల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

# త్వరలో ఆమదాలవలస మాజీ సైనికుల యూనియన్ ఎన్నికలు

(సత్యంన్యూస్, ఆమదాలవలస)

త్వరలో ఆమదాలవలస మాజీ సైనికుల యూనియన్ ఎన్నికలు నిర్వహించేందుకు నిర్ణయించుకున్నారు. ఆమదాలవలసలో ఆదివారం నియోజకవర్గ మాజీ సైనికుల ప్రెసిడెంట్ సూర అవతారం ఆధ్వర్యంలో మాజీ సైనికులు కలుసుకున్నారు. ఈ సందర్భంగా అవతారం మాట్లాడుతూ తన ఆరోగ్యం సహకరించని కారణంగా వేరే వ్యక్తిని ఆమదాలవలస ప్రెసిడెంట్‌గా నిర్ణయిద్దామని కోరారు. అలాగే ప్రెసిడెంట్‌గా నిలబడే వ్యక్తి తన ప్యానెల్ సభ్యులైన ఒక వైస్ ప్రెసిడెంట్, జనరల్ సెక్రటరీ, కోశాధికారి పేర్లతో రావాలని పిలుపునిచ్చారు. చైర్మన్ గురుగుబెల్లి సత్యనారాయణ మాట్లాడుతూ ఎన్నికల కమిటీ ఏర్పాటుచేసి జనవరిలో నామినేషన్ స్వీకరించి, ఫిబ్రవరిలో ఎలక్షన్ పెడదామని సభకు వివరించారు. కొత్తగా ఆమదాలవలసలో సెటిలైన విశ్రాంత లెఫ్టినెంట్ కల్నల్ పి.శంకర్‌రావు తన సహాయ సహకారాలు యూనియన్‌కు అందిస్తానని ఈ సందర్భంగా భరోసా ఇచ్చారు. మాజీ సైనికుడు సంజీవరావు రిజిస్టర్డ్ సభ్యులు మాత్రమే ఓటు వేయాలా అని ప్రశ్నించగా, ప్రస్తుత ప్రెసిడెంట్ అవతారం అవునని తెలిపారు. ఎలక్షన్ కమిటీ మెంబెర్స్‌గా విశ్రాంత లెఫ్టినెంట్ కల్నల్ పి.శంకర్‌రావు, సుబేదార్ మేజర్ బర్రి సంజీవరావు (రిటైర్డ్), సుబేదార్ గురుగుబెల్లి సత్యనారాయణ (రిటైర్డ్) ఉంటారని ప్రకటించారు. ఈ కార్యక్రమంలో డిస్ట్రిక్ట్ ఎక్స్ సర్వీస్‌మెన్ ఫెడరేషన్ శ్రీకాకుళం అధ్యక్షులు పూర్ణచంద్రరావు కటకం, తాండ్ర జనార్దనరావు, బొడ్డేపల్లి శ్రీనివాస్, పేడాడ కృష్ణారావు, అన్నెపు మురళీ, పప్పల రాజారావు, పైడి సూర్యారావు, పొన్నాడ శ్రీనివాస్, సనపల రాములు, జి.రాజారావు, ఆమదాలవలస చుట్టుపక్కల మాజీ సైనికులు పాల్గొన్నారు.

## ఆకాశవాణిలో కొండలరావు ప్రసంగాలు



(సత్యంన్యూస్, పొందూరు)

ఆకాశవాణి విశాఖపట్నం కేంద్రం నుంచి చింతన ధారావాహిక కార్యక్రమంలో భాగంగా నామ విజ్ఞానవేత్త, శ్రీకాకుళం తెలుగు రచయితల వేదిక సభ్యుడు వాండ్రంగి కొండలరావు వ్యాఖ్యానాలు ప్రారంభమయ్యాయి. సోమవారం 'అన్నదానం మహాదానం' అనే అంశంపై ఆయన మాట్లాడారు. అలాగే ఈ నెల 24,26,28 తేదీల్లో ఉదయం 6.30 గంటలకు వివిధ సామాజిక, ఆధ్యాత్మిక అంశాలపై ఆయన ప్రసంగిస్తారు. ఇప్పటికే వీటిపై విశాఖపట్నం ఆకాశవాణి కేంద్రం స్టేషన్ డైరెక్టర్ ఇందిర పర్యవేక్షణలో డ్యూటీ ఆఫీసర్ తేతలి దిలీప్‌కుమార్‌రెడ్డి ఆధ్వర్యంలో రికార్డింగ్ జరిగింది. గతంలో పలుసార్లు దేశభాషలందు తెలుగు లెస్స, ఊరు-పేరు, గ్రామ నామాలు (ఆంధ్రప్రదేశ్), దివంగత ప్రధాని పీవీ నరసింహారావు, అభ్యుదయ రచయిత పాలగుమ్మి పద్మరాజు, ప్రపంచ పుస్తక దినోత్సవం, పొందూరు ఖాదీ, ఖాదీ రంగంలో ఫ్యాషన్ టెక్నాలజీ, చింతన తదితర అనేక అంశాలపై ఆకాశవాణి విశాఖపట్నం, హైదరాబాద్, ఆదిలాబాద్ కేంద్రాలు కొండలరావు ప్రసంగాలను ప్రసారం చేశాయి. టాల్ రేడియో (డల్లాస్/టెక్సాస్) ఈ ఏడాది మే, జూన్ నెలల్లో ఊరి పేర్లపై నిర్వహించిన ఇంటర్వ్యూలలో పాల్గొని ప్రశంసలు పొందారు. ఈ సందర్భంగా నామవిజ్ఞానవేత్త కొండలరావును శ్రీకాకుళం తెలుగు రచయితల వేదిక(తెరవే) అధ్యక్ష, కార్యదర్శులు ఉత్తరావల్లి నాగేశ్వరరావు, రఘుపాత్రుని వెంకటరమణమూర్తి, విశ్రాంత రీడర్ తదితరులు అభినందించారు.

## విద్యుత్ ఛార్జీల పెంపుపై 27న వైకాపా పోరుబాట



(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

చంద్రబాబు పాలనలో విద్యుత్ ఛార్జీల పెంపు భారం మోపడాన్ని నిరసిస్తూ ఈ నెల 27న జిల్లాలోని అన్ని నియోజకవర్గ కేంద్రాల్లో వైకాపా పోరుబాట పేరిట ఆందోళన కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు పార్టీ జిల్లా అధ్యక్షులు ధర్మాన కృష్ణదాస్ తెలిపారు. రాష్ట్ర ప్రజలపై ఏకంగా రూ.15,485 కోట్ల భారాన్ని మోపుతూ, ఛార్జీల పెంపునకు నిరసనగా వైకాపా అధినేత వైఎస్ జగన్ పిలుపు మేరకు ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు సోమవారం ఒక ప్రకటనలో వివరించారు. ఎన్నికలకు ముందు ప్రజలకు చంద్రబాబు అనేక హామీలిచ్చారని, తాము అధికారంలోకి వస్తే విద్యుత్ ఛార్జీల పెంపుదల ఉండదని ప్రజలను నమ్మించి, అధికారంలోకి వచ్చిన ఆర్నెళ్లలోనే ప్రజలపై రూ.వేల కోట్ల భారాన్ని మోపుతున్నారని చెప్పారు. ప్రజలకు అండగా వైకాపా ఈ నెల 27న తలపెట్టిన నిరసన కార్యక్రమాలకు అన్ని వర్గాలు మద్దతు తెలపడంతో పాటు పెద్ద ఎత్తున భాగస్వాములు కావాలని ఆయన పిలుపునిచ్చారు.

# వైద్యుల గైర్హాజరుపై ఎమ్మెల్యే గరం గరం

❖ ఆకస్మిక తనిఖీలో విస్తుపోయిన నిజాలు

❖ ఆరుగురు వైద్యులుండాల్సిన సమయంలో ఒక్కరే విధులు

❖ కలెక్టర్, డీసీహెచ్‌లకు ఫోన్లో ఫిర్యాదు చేసిన శిరీష



(సత్యంన్యూస్, పలాస)

ప్రజలకు వైద్య సేవలందించేందుకే సర్కారీ దవాఖానాలున్నాయని, విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని ఎమ్మెల్యే గౌతు శిరీష హెచ్చరించారు. పలాసలోని ప్రభుత్వ సామాజిక ఆసుపత్రిని సోమవారం ఆమె ఆకస్మికంగా పరిశీలించారు. ఆ సమయానికి ఆరుగురు వైద్యులు విధుల్లో ఉండాల్సి ఉన్నప్పటికీ, ఒక్కరే ఉండడంపై మండిపడ్డారు. ప్రజలకు సేవలు అందించే విషయంలో కినుకు వహిస్తే చర్యలు తీవ్రంగా ఉంటాయన్నారు. గత పాలకులు ఈ అంశంలో చూసీచూడనట్లుగా వ్యవహరించేవారని, ఆ పోకడలను ఇంకా కొనసాగిస్తే మూల్యం చెల్లించుకోవలసి ఉంటుందని హెచ్చరించారు. దీనిపై కలెక్టర్, డిసిహెచ్‌లకు ఫోన్లో ఫిర్యాదు చేశారు.

## పశుసంవర్ధక శాఖలో రూ.11 కోట్లు గోల్‌మాల్

(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

పశుసంర్ధక శాఖలో రూ.11కోట్లు ఎస్సీ సబ్‌ప్లాన్ నిధులు గోల్‌మాల్ అయినట్టు దళిత సంఘాల నాయకులు ఇనుప రాజారావుతో పాటు మరికొందరు దళిత సంఘాల నాయకులు గ్రీవెన్స్‌లో జేసీ ఫర్మాన్ అహ్మద్ ఖాన్ సోమవారం ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నిధులు గోల్‌మాల్ వెనుక ఎవరెవరు ఉన్నారో సమగ్ర విచారణ చేపట్టి బాధ్యుల నుంచి రికవరీ చేసి దోషులను శిక్షించాలని కోరారు. దళిత రైతులకు ఎస్సీ సబ్‌ప్లాన్ కింద 75 శాతం సబ్సిడీపై పశువుల దాణా పంపిణీ చేసేందుకు కేటాయించిన రూ.11కోట్లు దుర్వినియోగంపై విచారణ జరిపించాలన్నారు. పసువుల దాణా కోసం దళిత రైతులు వారి వాటాగా 25 శాతం చెల్లించలేదు. ఈ నిధులు వచ్చినట్టు దళిత రైతులకు సమాచారం ఇవ్వకుండా నిధులు పక్కదారి పట్టించారని జేసీకి వివరించారు. రికార్డుల్లో సబ్సిడీ ద్వారా దాణా అందించినట్టు చూపించి క్షేత్రస్థాయిలో పంపిణీ చేయలేదన్నారు. దీనిపై జేసీ స్పందిస్తూ ఎస్సీ సబ్‌ప్లాన్ నిధులు దుర్వినియోగంపై జిల్లా అగ్రికల్చర్ జేడీ, ఆర్డీవో, జిల్లా పశుసంవర్ధక శాఖ జేడీలతో కూడిన త్రిసభ్య కమిటీని ఏర్పాటు చేస్తున్నట్టు తెలిపి సమగ్ర దర్యాప్తును సకాలంలో పూర్తి చేసి నివేదికను సమర్పించాలని ఆదేశించారు.

# క్రీస్తు ఆశీస్సులు రాష్ట్రంపై మెండుగా ఉండాలి

## - రాష్ట్ర వ్యవసాయ శాఖామంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు -



(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

యేసుక్రీస్తు ఆశీస్సులు రాష్ట్రం, జిల్లాపై ఉండాలని రాష్ట్ర మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు అన్నారు. కోడిరామమూర్తి స్టేడియం మైదానం పక్కన గల డాక్టర్ బీఆర్ అంబేద్కర్ కళావేదికలో ఏర్పాటు చేసిన హైటీ క్రిస్టమస్-2024 కార్యక్రమంలో ఆయనతో పాటు కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ఏర్పాటుచేసిన కార్యక్రమం క్రిస్టియన్ హైటీ అని, జిల్లా యంత్రాంగం ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరుగుతుందన్నారు. ప్రభుత్వం, మంత్రి తరఫున ముందస్తు క్రిస్టమస్ శుభాకాంక్షలు తెలిపారు. 2014-19లో చర్చిలకు పెయిటింగ్, తదితర ఎన్నో వినూత్న కార్యక్రమాలు, పథకాలు ప్రారంభినట్లు చెప్పారు. క్రిస్టియన్ సోదరులు బరియేల్ గ్రౌండ్ అడిగితే, వారికి భూమి కేటాయించాలని అధికారులకు తెలియజేసి అవకాశముంటే కాంపౌండ్ వాల్ కూడా నిర్మించాలని సూచించినట్లు చెప్పారు. పాస్టర్లకు గౌరవ వేతనం కింద నెలకు రూ.5వేలు ప్రభుత్వం ఇస్తున్నట్లు పేర్కొన్నారు. పాస్టర్లలో గ్రూపులు ఉండకూడదని, అందరూ సమానంగా ఉండాలన్నారు. కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ మాట్లాడుతూ ప్రభుత్వం ఏర్పాటు చేసిన క్రిస్టమస్ హైటీకి విచ్చేసిన క్రిస్టియన్లకు శుభాకాంక్షలు తెలిపారు. నరసన్నపేట ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి మాట్లాడుతూ హైటీ కార్యక్రమంలో క్రిస్టియన్లు ఒకరికొకరు గౌరవంగా పలుకరించుకోవాలన్నారు. ఎమ్మెల్యే గొండు శంకర్ మాట్లాడుతూ క్రిస్టియన్ల వేడుకలపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించినట్లు చెప్పారు. పాస్టర్ కృపానందం యేసు జననాన్ని గూర్చిన వార్త క్రిస్టమస్ సందేశమన్నారు. జిల్లా మైనార్టీ సంక్షేమ అధికారి జాన్ మాట్లాడుతూ క్రిస్టయన్ల విజ్ఞప్తి మేరకు ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు క్రిస్టమస్ హైటీ వేడుకలకు లక్ష రూపాయలు మంజూరు చేసినందుకు ధన్యవాదాలు తెలిపారు. క్రిస్టియన్లకు రియల్ గ్రౌండ్ ఏర్పాటు చేసుకునేందుకు భూకేటాయింపు చర్యలు చేపడతామన్నారు. కొత్తూరు నుంచి వచ్చిన పాస్టర్ బాలరాజు బైబిల్ పఠనం చేశారు. రెండవ బైబిల్ పఠనంగా వజ్రపుకొత్తూరు నుంచి వచ్చిన సూరాడ యేకబ్, నందిగాం మండలం నుంచి వచ్చిన పాస్టర్ మూడవ బైబిల్ పఠనం చేశారు. బైబిల్ పఠనంపై దేవదాసు ప్రార్థన చేశారు. డీవీడీబీ కుమార్ (బోసుబాబు) క్రిస్టియన్లకు ఉన్న సమస్యలను మంత్రి దృష్టికి తీసుకొచ్చారు. కేండిల్ వెలిగించిన అనంతరం మంత్రి క్రిస్టమస్ కేక్ కట్ చేశారు. ఆర్డీవో కె.సాయి ప్రత్యూష, పీఏసీఎస్ మాజీ అధ్యక్షులు కింజరాపు హరివరప్రసాద్, జిల్లాలోని పాస్టర్లు, విశ్వాసులు పాల్గొన్నారు.

# మాయమైన ప్రభుత్వ వాహనం.. స్క్రాప్ షాపులో దర్శనం



(సత్యంన్యూస్, కొత్తూరు)

కొత్తూరు మండలంలోని ప్రభుత్వ ఆసుపత్రి ఆవరణలో పాడైపోయిన ప్రభుత్వ వాహనం మాయమై స్క్రాప్ షాప్‌లో దర్శనమిచ్చింది. తర్వాత రోజు విడిభాగాలుగా దర్శనమిచ్చాయి. ఈ విషయం తెలుసుకున్న టీడీపీ జిల్లా అధ్యక్షులు కలమట వెంకటరమణ వెంటనే అక్కడకు చేరుకుని డీఎంహెచ్‌వోతో ఫోన్లో మాట్లాడారు. దీనికి కారణమైన వారిపై వెంటనే చర్యలు తీసుకోవాల్సిందిగా హాస్పిటల్ సిబ్బందిని, జిల్లాస్థాయి అధికారులను కోరారు.

## రైతుల పట్ల కేంద్ర ప్రభుత్వం నిర్లక్ష్యం తగదు

(సత్యంన్యూస్, పలాస)

కేంద్ర ప్రభుత్వం నిర్లక్ష్య వైఖరి విడనాడి, రైతులకు న్యాయం చేయాలని రైతు సంఘాల ఐక్యవేదిక నాయకులు డిమాండ్ చేశారు. జాతీయ రైతు దినోత్సవం సందర్భంగా సంయుక్త కిసాన్ మోర్చా పిలుపు మేరకు కేంద్ర ప్రభుత్వ విధానాలపై స్థానిక రైతు, కార్మిక సంఘాల సమన్వయ కమిటీ ఆధ్వర్యంలో కాశీబుగ్గ గాంధీ విగ్రహం వద్ద నిరసన చేపట్టి, రైతు వ్యతిరేక నల్లచట్టాల జీవో ప్రతులను దగ్ధం చేశారు. ఈ సందర్భంగా రైతు, కార్మిక సంఘాల నాయకులు, సిహెచ్ వేణుగోపాల్, ఎన్.గణపతి, ఎం.రామారావు, జి.బాలకృష్ణ, ఎం.వినోద్ కుమార్, టి.అజయ్ కుమార్, పి.దుర్యోధన మాట్లాడుతూ రద్దు చేసిన రైతు వ్యతిరేక చట్టాలనే మోడీ అమలుచేస్తూ మోసం చేస్తున్నారని విమర్శించారు. ఈ కార్యక్రమంలో రైతు సంఘాల నాయకులు కె.బాలాజీరావు, అప్పయ్య, సిహెచ్ రవి, జి.గోవింద్, జగన్, పి.నాగేశ్వరావు, కె.పురుషోత్తం, పలువురు నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



## 24న అనుగ్రహ, ఆధ్యాత్మిక సమ్మేళనం

(సత్యంన్యూస్, పొందూరు)

ఈ నెల 24న ఉదయం 10 గంటలకు స్థానిక పట్టుశాలి కళ్యాణ మండపంలో ఏకం అనుగ్రహ, ఆధ్యాత్మిక, ఆరోగ్య చైతన్య కార్యక్రమం జరుగనుంది. చిత్తూరు జిల్లా ఏకం పుణ్యక్షేత్రం నుంచి చంద్రశేఖర్ దాస మార్గదర్శనం చేస్తారని స్థానిక ఏకం అనుగ్రహ విభాగం ప్రతినిధులు తెలిపారు. అందరూ ఆహ్వానితులేనని, వివరాలకు గుడ్ల అన్నాజీరావును 93906 10924 నెంబరులో సంప్రదించాలని కోరారు.

## శ్రీనివాస రామానుజన్‌ను ఆదర్శంగా తీసుకోవాలి



(సత్యంన్యూస్, పొందూరు)

నేటి విద్యార్థులు ప్రపంచ ప్రఖ్యాత గణిత శాస్త్రవేత్త శ్రీనివాస రామానుజన్‌ను ఆదర్శంగా తీసుకుని భారతదేశ ఖ్యాతిని విస్తరింపచేయాలని ఆప్తాలమిక్ అధికారి, రోటేరియన్ సప్పటి వసంతరావు అన్నారు. జాతీయ గణిత దినోత్సవం సందర్భంగా ప్రిన్సిపాల్ ఆర్.సౌమ్య ఆధ్వర్యంలో ప్రభావతి జాగృతి ట్రస్ట్ (పొందూరు), రోటరీ క్లబ్ (శ్రీకాకుళం) సంయుక్తంగా లోలుగు కేజీబీవీ ఆవరణలో శ్రీనివాస రామానుజన్ 137వ జయంతి ఉత్సవాలు నిర్వహించారు. ఈ సందర్భంగా వసంతరావు మాట్లాడుతూ భారతదేశం వేల సంవత్సరాల క్రితం ఖగోళ శాస్త్ర విజ్ఞానం గురించి ప్రపంచానికి చాటిచెప్పిందని, ఇటువంటి దేశంలో జన్మించిన శ్రీనివాస రామానుజన్ శతాబ్దం క్రితమే గణితంలో వినూత్న పరిశోధనలతో లండన్ కేంబ్రిడ్జ్ విశ్వవిద్యాలయంలోని గణిత శాస్త్రవేత్త జిహెచ్ హార్డీ, లిటిల్ వుడ్ వంటి ప్రఖ్యాత గణిత శాస్త్రవేత్తలతో పనిచేసి లాండా రామానుజన్ స్థిరాంకం, మాక్ తీటా ఫంక్షన్, రామానుజన్ ప్రైమ్ వంటిపైన అనేక గణిత గ్రంథ ఆవిష్కరణలు చేసి ప్రపంచానికి భారతదేశ గొప్పదనాన్ని చాటి చెప్పారని అన్నారు. విద్యార్థులు కూడా కార్యదీక్ష, ప్రణాళికబద్ధమైన ఆచరణతో చదవాలన్నారు. గణిత ఉపాధ్యాయురాలు సమీరా నేతృత్వంలో ఆటపాటలతో గణిత శాస్త్ర ఔన్నత్యంపై ప్రదర్శనలు చేశారు. అనంతరం వివిధ శ్రేణులలో నిర్వహించిన గణిత పోటీ విజేతలకు మెడల్స్, సర్టిఫికెట్స్ అందజేశారు. ఈ కార్యక్రమంలో విద్యార్థినులు, అధ్యాపకులు, ఉపాధ్యాయినులు మాధురి, జ్యోతి తదితరులు పాల్గొన్నారు.

## దోపిడీ కుట్ర మూలాలు గూనపాలెంలో..

(మొదటిపేజీ తరువాయి)

రంగంలోకి దించుతాడని తెలుస్తుంది. చాన్నాళ్ల క్రితం ముంబయి నుంచి డబ్బున్న వ్యక్తిని కిడ్నాప్ చేసి సొమ్ములు డిమాండ్ చేస్తున్న నేపథ్యంలోనే సంబంధిత వ్యక్తి చనిపోవడంతో పెద్దిన లక్ష్మణరావు పేరు తొలిసారిగా నగరంలో వినిపించింది. ఆ తర్వాత ఇలాంటి పనులు అనేకం చేసినా ఎక్కడా దొరక్కుండా తప్పించుకునేవాడని, కొద్ది రోజుల క్రితం స్థానిక రిలయన్స్ మార్ట్‌లో కూడా ఒకే బిల్లుమీద రెండుసార్లు సరుకును తరలించి దొరికిపోయాడని, అయితే పోలీస్‌స్టేషన్ వరకు ఈ కథ చేరకపోవడంతో పెద్దగా ప్రచారం జరగలేదని తెలుస్తుంది. ఒకవైపు రియల్ ఎస్టేట్ బ్రోకరైజ్ చేస్తునే, మరోవైపు పెళ్లి సంబంధాలని ఎవరికీ తెలియకుండా కిరాయి మూకలను తేవడం వంటివి పెద్దిన లక్ష్మణరావుకు రొటీనేనని చాలామంది చెబుతున్నారు. పోలీసుల అదుపులో ఉన్న నిందితులు నోరిప్పితే నగరంలో ఇలాగే ఏడెనిమిది చోట్ల ప్రయత్నించి విఫలమైన ఘటనలు బయటకు వస్తాయి.

Printed by N.V.S. prasad, at Srikakulam and published by SATYAM PRINTERS, plot No. 8, Santamma colony, Srikakulam- 532001, Andhrapradesh on behalf of SANCHALANA SAYANKALA PATRIKA SATYAM, Srikakulam. Editor N.V.S. Prasad, Srikakulam, Andhra Pradesh. APTEL No. 2005/17967. Postal Reg. No. D/RNP/SKL-12/12-15.